# ఆకాశ వీధిలో..

# అయిదు రోజుల పండుగ



బంజారాహిల్స్‌లోని ముఫకంజా కళాశాలలో స్కైఫెస్ట్ కోసం తెప్పించిన హాట్‌బెలూన్‌ను తిలకిస్తున్న స్థానికులు

నమస్తే తెలంగాణ, సిటీబ్యూరో: అంబురాన్నంటే సంబురాలకు నగరం మరోమారు వేదికవుతోంది. హైదరాబాద్ నగరంలో డిసెంబర్ 23 నుంచి అయిదు రోజులపాటు వేడుకగా నిర్వహించే 'స్కై ఫెస్ట్' షెడ్యూల్‌ను తాజ్ దక్కన్‌లో బుధవారం ఉదయం నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో నిర్వాహకులు ప్రకటించారు. పంచాయతీరాజ్, ఐటీ శాఖ మంత్రి కే.తారక రామారావు, ఎంపీ ప్రభాకర్ రెడ్డి, ఐటీ శాఖ కార్యదర్శి జయేష్ రంజన్, మరికొందరితో కలిసి 'స్కై ఫెస్ట్ 2015' పోస్టర్‌ను ఆవిష్కరించారు. రోటరీ క్లబ్ (బంజారాహిల్స్) చారిటీ కార్యక్రమం 'స్పర్శ్ హోస్పైస్' నిధుల సేకరణ కోసం గచ్చిబౌలి స్టేడియంలో నిర్వహించే ఈ వేడుకలో శంకర్ మహదేవన్, దేవిశ్రీ ప్రసాద్, సోను నిగమ్ ప్రదర్శనలు ఇస్తారని, వీరితోపాటు డీజేలు, ఇతర కళాకారుల ప్రదర్శనలుంటాయని ఈవెంట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ జగదీష్ రాముడుగు తెలిపారు. ఈ మెగా ఈవెంట్‌లో ఫుడ్ అండ్ కార్నివాల్‌తోపాటు షాపింగ్, మిడ్ నైట్ మూవీస్ (మాయాబజార్, బాహుబలి, శ్రీమంతుడు), హాట్ ఎయిర్ బెలూన్ రైడ్, మెగా మ్యూజిక్ కాన్సెర్ట్, తెలంగాణ జానపద కళారూపాలు (డిసెంబరు 27) ఉంటాయని జగదీష్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమ నిర్వహణ ద్వారా వచ్చిన ఆదాయాన్ని క్యాన్సర్ రోగులకు ఉచిత వైద్యం, వసతి కల్పిస్తున్న 'స్పర్శ్ హోస్పైస్'కు అందిస్తామని డాక్టర్ ఎం.సుబ్రహ్మణ్యం అన్నారు. ఆన్‌లైన్ ద్వారా స్కై ఫెస్ట్ టికెట్లను కొనుగోలు చేయవచ్చని, ఈ వేడుకలో నిర్వహించే వినోద కార్యక్రమాలలో పాల్గొని ఆనందించడంతో పాటు పేదలు, దీనులకు చేయూతనిచ్చిన సంతోషమూ మిగులుతుందని ఆయన అన్నారు. ఐటీ మంత్రి కేటీఆర్ మాట్లాడుతూ ప్రతి మనిషి చివరి రోజుల్లో గౌరవంగా మరణించాలన్నారు. ఈ క్యాన్సర్ పీడితులు సంతోషంగా గడుపుతూ, చివరి రోజుల్లో గౌరవంగా జీవించేలా నగర పౌరులు సహకరించాలని, స్కై ఫెస్ట్‌లో పాల్గొని వారికి సహకారం అందించాలన్నారు.